క్లుప్తంగా

కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలి



లబ్ధిదారులకు వాకర్స్, వాకర్స్ స్టాండులు పంపిణీ చేస్తున్న అధికారులు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది,ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలని యర్రగుంట్ల పీహెచ్‌సీ డాక్టర్ దిలీప్‌కుమార్ సూచించారు.శుక్రవారం యర్రగుంట్ల పీహెచ్‌సీలో జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నడవటానికి ఇబ్బంది ఉన్న 12 మందికి వాకర్ స్టాండ్, 47 మందికి వాకర్ స్టిక్స్, 13 మందికిమెడ బెల్ట్, నడుము నొప్పి ఉన్న 20 మందికి లంబార్ బెల్ట్ అందజేశారు.అనంతరం డాక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, సూపర్ వైజర్ విశ్వనాథ్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ అరుణ,హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకూలిన చెట్టు



రోడ్డుకు అడ్డంగా కూలిన వేప చెట్టు

గుత్తి: పట్టణంలోని సీఎస్ఐ చర్చి వద్ద భారీ ఈదురు గాలులకు ఒక పెద్ద వేప చెట్టు నేల కూలింది. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడటంతో రాకపోకలు స్తంభించాయి. గంట పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది చెట్టును పక్కకు తరలించారు. విద్యుత్ సిబ్బంది తెగిపోయిన వైర్లను సరి చేసి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



మాట్లాడుతున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు.

పెద్దవడుగూరు: రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే అందించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రైతులకు 90 శాతం సబ్సిడీలో విత్తనాలు, ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. హెచ్చెల్సీ కాలువలను శుభ్రం చేయించి, చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో మదనపల్లిలో నిర్వహించే రాష్ట్ర రైతు సంఘం సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, పోలా రంగస్వామి, హంసేన్‌పీరా, రంగనాయకులు, సుధాకర్‌గౌడ్, శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

గుత్తి: డ్రైనేజీ, తాగునీటి సమస్యను పరిష్కారం చేయాలని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. వివరాలు.. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు శుక్రవారం ఎస్ఎస్‌పల్లి, 5వ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ, తాగునీటి సమస్యను పరిష్కారం చేయాలని కోరారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

కుక్కల దాడిలో జింక మృతి



మృతి చెందిన జింక

పుట్లూరు: మండలంలోని చింతకుంట సమీపంలో శుక్రవారం కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందింది. పశువైద్యాధికారితో పోస్టుమార్టం నిర్వహించిన అటవీ అధికారులు జింక కళేబరాన్ని ఖననం చేశారు.

నగదు చోరీ

పుట్లూరు: మండలంలోని కడవకల్లులోని ఓ ఇంట్లో దుండగులు నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... ఆదినారాయణ ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి మొహర్రం పండుగకు శింగనమల మండలం కొరివిపల్లికి వెళ్లాడు. శుక్రవారం ఇంటికి చేరుకున్నారు. అప్పటికే తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు బీరువాలోని రూ.81 వేలను అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

వీధి కుక్కల స్వైర విహారం

- మనుషులతో పాటు పశువులు, జీవాలపై దాడి
- నష్టపోతున్న రైతులు

పెద్దవడుగూరు: రోజు రోజుకూ వీధి కుక్కలు పెట్రేగి పోతున్నాయి. వీధికుక్కలు గుంపులుగా చేరి చిన్న పిల్లలపై దాడి చేస్తున్నాయి. అలాగే పశువులు, గొర్రెలు, మేకలను గాయపరుస్తుండడంతో పలు జీవాలు మృత్యువాత పడుతున్నాయి. గత నెల రోజులుగా మండలంలోని 25 పంచాయతీల్లో 50కి పైగా గొర్రెలు, మేకలు కుక్కల దాడిలో గాయపడి మృత్యువాత పడినట్లు సమాచారం. అలాగే పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో సుమారుగా 120 మందికి పైగా ప్రజలు కుక్కకాటుకు గురైనట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన డాగ్ బైట్ ఇంజెక్షన్లు సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందిగా ఉందన్నారు. కాగా కొన్ని కుక్కలు నడుచుకుంటూ వెళ్తున్న మనుషులపై దాడి చేస్తున్నాయి. మరి కొన్ని కుక్కలు రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్న వారిని వెంబడించి మరీ దాడి చేసి గాయపరుస్తున్నాయి. అలాగే ఇళ్ల వద్ద పెంచుకుంటున్న గొర్రెలు, పొట్టేళ్లు, కోళ్లను కుక్కలు చంపి తింటూ తీవ్ర నష్టానికి గురి చేస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



కుక్కల దాడిలో గాయపడిన గొర్రె పిల్లకు చికిత్స చేస్తున్న పశు వైద్య సిబ్బంది (ఫైల్)



మండల కేంద్రంలో రోడ్డుపై గుంపుగా తిరుగుతున్న కుక్కలు

దాడికి తెగబడుతున్నాయి



రాత్రి సమయాల్లో బయట తిరగాలంటే భయంగా ఉంది. చికెన్ సెంటర్ల వద్ద కుక్కలు గుంపుగా ఉంటున్నాయి. వాటి దగ్గరగావెళ్తే దాడికి తెగబడుతున్నాయి. దీనికి తోడు గ్రామంలోకి కొత్త కుక్కలు వచ్చాయి. అవి గొర్రెలపైన, మేకలపై దాడులు చేస్తూ నష్టాన్ని కలిగిస్తున్నాయి.

– ఖాజా, పెద్దవడుగూరు

పాఠశాలకు వెళ్లాలంటే భయంగా ఉంది



పెద్దవడుగూరులో పాఠశాలకు దగ్గరలో కూడా కుక్కలు గుంపులుగా ఉంటాయి. నడుచుకుంటే వెళ్తే కరవడానికి వస్తున్నాయి. ఎక్కడ దాడులు చేస్తాయోనని భయంగా ఉంది. అధికారులు చర్యలు తీసుకుని కుక్కల బెడద నుంచి రక్షించాలి.

– అఖిల, 7వ తరగతి, పెద్దవడుగూరు

ప్రథమ చికిత్స తప్పనిసరి



కుక్క కాటుకు గురైతే ప్రథమ చికిత్స తప్పనిసరిగా చేయించుకోవాలి. అలా చేయకపోతే మరణం సంభవించే అవకాశాలు ఉన్నాయి. కాటుకు గురైన వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలో సంప్రదించాలి. కుక్క కాటు రేబిస్ వ్యాధి వస్తే చాలా ప్రమాదం.

– కమల, వెటర్నరీ డాక్టర్

నెలాఖరు వరకూ వేరుశనగ సాగు చేసుకోవచ్చు



పంట సాగుదారుల ధ్రువీకరణ పత్రాలపై అవగాహన కల్పిస్తున్న డీడీఏ మద్దిలేటి



కండ్లపల్లిలో మాట్లాడుతున్న గుత్తి ఏడీఏ వెంకటరాముడు

శింగనమల: రైతులు ఈనెలాఖరు వరకూ వేరుశనగ పంటను సాగు చేసుకోవచ్చని డీడీఏ మద్దిలేటి సూచించారు. శుక్రవారం మండలంలోని సలకంచెరువు, రాచేపల్లి రైతు సేవా కేంద్రాల్లో పంట సాగుదారుల ధ్రువీకరణ పత్రాలపై అవగాహన, పంటల సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేరుశనగను ఈ నెలాఖరువరకూ, కంది పంటను ఆగస్టు మొదటి వారం వరకూ సాగు చేయవచ్చన్నారు. అలాగే పెసర, ఉద్ది, కొర్ర, ఉలవ పంటలు కూడా సాగు చేసుకోవచ్చునన్నారు. ప్రతి పంటకూ విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శైలజ,ఏఓ శ్రీనివాసులు, ఏఈఓ ప్రసాద్, ఏఓ అన్వేష్ కుమార్, వీహెచ్ఏ రాజేశ్వరి, ఎంపీఈఓ జయలక్ష్మి, సిబ్బంది రామచంద్రుడు, పరుశురాముడు పాల్గొన్నారు.

'పొలంబడి'తో అధిక దిగుబడి

పామిడి: పొలంబడిలోని సమగ్ర సస్య రక్షణను పాటించడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని గుత్తి ఏడీఏ వెంకటరాముడు సూచించారు. ఏఓ లీనా వసుంధర ఆధ్వర్యంలో మండలంలోని కండ్లపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీస్ (జీఏపీ)–పొలంబడిపై గ్రామ రైతులకు అవగాహన కార్యక్రమంతో పాటు గ్రామసభ ఏర్పాటు చేశారు. ఏడీఏ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, ఆరోగ్యకరమైన పంటలు పండించాలన్నారు. వేరుశనగ, కంది, కొర్ర, వరి మొదలగు పంటల సాగుకు పాటించాల్సిన సూచనలు, మెలకువలు, పద్ధతులపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరావు, వీఏఏ వర్ష, ఎంపీఈఓ రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ఊరి మధ్యలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయిస్తున్నాడు



కలెక్టర్‌కు సమస్యను విన్నవించేందుకు వచ్చిన రేకులకుంట గ్రామస్తులు

అనంతపురం అర్బన్: 'పంచాయతీ అనుమతి లేకుండా ఒక వ్యక్తి తన ఫ్యాక్టరీ కోసం ఊరి మధ్య నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయిస్తున్నాడు. ఇలా చేయడం వల్ల ప్రజలకు ప్రమాదకరమని చెప్పినా వినడం లేదు' అని రేకులకుంట గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేశారు. సమస్యను కలెక్టర్‌కు విన్నవించుకునేందుకు బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి పంచాయతీ రేకులకుంట, అమ్మవారిపేట గ్రామ ప్రజలు శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చారు. మాజీ సర్పంచ్ నారాయణ స్వామి, మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు సామ్రాట్ మధు మాట్లాడుతూ.. ఓ వ్యక్తి ఫ్యాక్టరీ కోసం విద్యుత్ లైన్‌ను గ్రామ మధ్య నుంచి ఏర్పాటు చేయిస్తున్నాడన్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు, తాగునీటి పైప్‌లైన్లు ఉన్నాయన్నారు. ఇలా ఊరి మధ్య నుంచి విద్యుత్ లైను ఏర్పాటు చేయడం చాలా ప్రమాదకరం, ప్రాణాపాయం అని చెప్పినా వినిపించుకోవడం లేదన్నారు. ఊరి బయటి నుంచి లైన్లు తీసుకెళ్లాలని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు వెంకటేసులు, ఆదెప్ప, నల్లప్ప, ధనుంజయలు, రామాంజనేయులు, ఆదినారాయణ, నాగరాజు, లక్ష్మీనారాయణ, అక్కులప్ప, పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



సైనికుడు జింకా కృష్ణమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గుత్తి ఆర్ఎస్‌కు చెందిన కార్గిల్ సైనికుడు నాయబ్ సుబేదార్ జింకా కృష్ణమూర్తిని సన్మానించారు. కార్గిల్ యుద్ధంలో ఎదురైన పరిస్థితులు, శత్రువులపై సాధించిన విజయాన్ని ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రాజేష్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తన్వీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దేశసేవలో యువత ముందుండాలి

గుంతకల్లుటౌన్: దేశం కోసం ప్రాణాలు తెగించి విధులు నిర్వర్తిస్తున్న సైనికులను యువత ఆదర్శంగా తీసుకుని దేశసేవలో ముందుండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య సూచించారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవిశంకర్ శర్మ, డాక్టర్ జనార్దన్ శాస్త్రీ, గోపినాయక్, ఓబులేసు, నారాయణ, ఎన్‌సీసీ అధికారి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా కన్యకా పరమేశ్వరి







తాడిపత్రి, బీకేఎస్, పామిడిలో శాకంబరి అలంకరణలో పూజలందుకుంటున్న అమ్మవారు

తాడిపత్రి అర్బన్/బుక్కరాయసముద్రం/పామిడి: తాడిపత్రిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలోని అమ్మవారు శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలతో విశేషంగా అలంకరించారు. ఇలా చేస్తే అమ్మవారి అనుగ్రహం కలిగి వర్షాలు సంవృద్ధిగా కురిసి. పంటలు బాగా పండుతాయని, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని భక్తుల విశ్వాసం. ఈసందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి సామూహిక లలితా సహస్రనామ పారాయణం, గోరింటాకు, కుంకుమార్చనలు చేశారు. ఏటా ఆషాఢ మాసంలో అమ్మవారికి శాకాంబరి అలంకరణ చేస్తామని ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్ తెలిపారు. అలాగే

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని మునసలమ్మ కట్ట సమీపంలో వెలసిన రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఆలయంలో దీపాలు వెలిగించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా పామిడి పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో కన్యకా పరమేశ్వరీ మాత శాకాంబరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

డయేరియా సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



శింగనమలలోని కేజీబీవీలో కూరగాయలను పరిశీలిస్తున్న వైద్యురాలు తేజశ్విని



పామిడి మండలం కాలాపురంలో పారిశుధ్య పనులు చేయిస్తున్న ఈఓఆర్డీ బీవీ శశికళ



యల్లనూరులో అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి గీత, ఏఎన్ఎం శ్రీదేవి

శింగనమల: విద్యార్థులకు డయేరియా సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కేజీబీవీ, ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాల సిబ్బందికి తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి తేజశ్విని సూచించారు. శుక్రవారం శింగనమలలోని కేజీబీవీ, ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలను ఆమె సందర్శించారు. అక్కడ ఉన్న సిబ్బందికి డయేరియా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వసతి గృహాల్లో తాగునీటి ట్యాంకులు, వంట శాల, కూరగాయలు, బాత్‌రూం, టాయిలెట్స్ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో హెల్త్ ప్రొవైడర్ దివ్యభారతి, ఏఎన్ఎం శైలజ, ఆశా వర్కర్లు, కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పామిడి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఓఆర్డీ బీవీ శశికళ సూచించారు. శుక్రవారం మండలంలోని కాలాపురం, జీఏ కొట్టాల గ్రామాల్లో ఈఓఆర్డీ ఆధ్వర్యంలో కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి గీత, ఏఎన్ఎం శ్రీదేవి అన్నారు. యల్లనూరు సచివాలయంలో సర్పంచు పెద్ద ఓబులమ్మ అధ్యక్షతన ఓడీఎఫ్ ప్లస్ కార్యక్రమం గ్రామసభ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీఆర్వో మహిత, సచివాలయ సిబ్బంది ఇంతియాజ్, దాదాపీర్, గోపాల్‌నాయుడు, నగేష్, మాధవి, రాజ్‌కుమార్, ఆశా వర్కర్ రమాదేవి, ప్రజలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కమిషనర్

గుంతకల్లుటౌన్: పట్టణ శివారులోని మున్సిపల్ సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ల ఆవరణలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, అధికారులు మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ పాటుపడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈ గురప్పయాదవ్, ఏఈలు హరికృష్ణ, సుదర్శన్ పాల్గొన్నారు. అంతకుముందు శానిటేషన్ అధికారులతో కలసి కమిషనర్ రైల్వేస్టేషన్ రోడ్‌లో పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కేసు నమోదు

యాడికి: పుప్పాల గ్రామంలో రెండు రోజుల క్రితం ఘర్షణకు సంబంధించి శుక్రవారం ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీకి చెందిన సుధాకర్ ఫిర్యాదు మేరకు దేవన్న, సుంకిరెడ్డి, శివ, చరణ్, ఖాజా, ప్రభా కర్, సురేష్, మహేష్ తదితర టీడీపీ నాయకులపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే టీడీపీకి చెందిన చెంచు రాజు ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీకి చెందిన సుధాకర్, మురళి, సుదర్శన్, రామాంజనేయులు, దేవేంద్ర, ఈశ్వర రెడ్డి, చిన్న వీరయ్య, గంగరాజు, అశోక్, రంగస్వామి నాయక్‌పై కేసు నమోదు చేశామన్నారు.

వేపనూనె పిచికారీతో లాభాలు

పెద్దవడుగూరు: మండలంలో పత్తి, వేరుశనగ పంటలు సాగు చేసిన రైతులు వేప నూనె పిచికారీ చేసుకోవడం వలన అధిక లాభాలను పొందవచ్చని ఏఓ మల్లీశ్వరి సూచించారు. శుక్రవారం స్థానిక ఏఓ కార్యాలయం వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు రసం పీల్చే పురుగు, గులాబీ పురుగు ఆశించే అవకాశాలు ఉన్నాయన్నారు. వేప నూనె పిచికారీ చేసుకుంటే ప్రయోజనం ఉంటుందన్నారు. మండలానికి విత్తన కొర్రలు వచ్చాయని, కొర్ర పంట సాగు చేసుకునే రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సునీత, రజిని, వీఆర్వో కుళ్లాయిస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన

గుంతకల్లు రూరల్: స్థానిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కసాపురం, దోనిముక్కల గ్రామాల్లో ఉన్న కౌలు రైతు అవగాహన సదస్సును నిర్వహించారు. ఏఓ స్వాతి మాట్లాడుతూ కౌలు రైతులు కౌలు కార్డులు తీసుకోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులవుతారనిన్నారు. హరిత అనంత కార్యక్రమంలో భాగంగా రైతులకు టేకు, ఎర్రచందనం తదితర మొక్కలను రూ.10 చొప్పున ప్రభుత్వం అందజేస్తుందని, ఈ మొక్కలను పొలం గట్లపై బండ్ ఫార్మింగ్ చేసుకోవడం వల్ల వర్షాభావ పరిస్థితులను అధిగమించవచ్చన్నారు.రైతు భరోసా కేంద్రం సిబ్బంది తిరుపాలు, భార్గవ్, వీఆర్వోపవన్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుచేయాలి

పామిడి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు సీ రమేష్ విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉపయోగకరమన్నారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాటు చేస్తానన్న సీఎం చంద్రబాబు తన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలో బీసీ కళాశాల బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షాన విద్యార్థులతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి తనిఖీ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం డ్రిస్టిక్ మలేరియా అధికారి ఓబులు, అడిషినల్ మలేరియా అధికారి సత్యనారాయణ డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం గన్నెవారిపల్లె కాలనీ, చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రతి ఆరోగ్య కార్యకర్త నెలలో 40 రక్త నమూనాలు సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, రామక్రిష్ణ, వైద్యులు లావణ్య, ఎంపీహెచ్ఈఓ సూర్యనారాయణ, కిరణ్, ల్యాబ్ టెక్నిషియన్ జ్యోతి పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం గడపాలి

యాడికి: ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవనం గడపాలని, గొడవలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ జనార్దన్‌నాయుడు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పుప్పాల గ్రామంలో డీఎస్పీ పర్యటించారు. సీఐ నాగార్జున రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీటీసీ భర్త మృతి

యాడికి: మండలంలోని లక్షుంపల్లె ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి భర్త బలరాముడు శుక్రవా రం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. తెల్లవారుజామున 4 గంటలకు ఆయన ఛాతీలో నొప్పి ఉందని చెప్పటంతో కుటుంబ సభ్యులు వెంటనే ఓ వాహనంలో గుత్తి కి తరలించారు. మార్గ మధ్యంలోనే అతడు మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, లక్షుంపల్లె, తూట్రాళ్ల పల్లె సర్పంచులు పద్మనాభరెడ్డి, సంజీవరాయుడు, ఎంపీటీసీలు అవుకు నాగరాజు, రా మ్మోహన్, నాయకులు వేలూరు జగదీస్ చౌదరి, నాగేష్,శివకేశవ రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, జయరామిరెడ్డి తదితరులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇరువర్గాలకు కౌన్సెలింగ్

పెద్దవడుగూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని లక్ష్మంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యకర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరించారు. ఆయన వెంట యాడికి రూరల్ సర్కిల్ సీఐ రోషన్, ఎస్ఐ చిన్నరెడ్డప్ప తదితరులు ఉన్నారు.

యువకుడి బలవన్మరణం

గుంతకల్లుటౌన్: స్థానిక మోదీనాబాద్ సెంట్రల్ స్కూల్ ప్రాంతానికి చెందిన ఆంజనేయులు(26) ఆత్మహత్య చేసుకున్నాడు. బేల్దారిగా పనిచేస్తున్న ఆంజనేయులు శుక్రవారం సాయంత్రం తల్లి మస్తానమ్మ బయటికి వెళ్లిన సమయంలో ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. కాగా, ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరు కావాలన్నారు.

31న మండల సర్వసభ్య సమావేశం

యల్లనూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 31న ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీరరాజు శుక్రవారం తెలిపారు. సమావేశానికి శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సర్పంచులు హాజరుకావాలన్నారు.

ప్రగతి లక్ష్యాలను చేరుకోండి

యల్లనూరు: మండలవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఉపాధి కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలని ఎంపీడీఓ వీరరాజు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పనులు కల్పించి వలసలు నివారించాలన్నారు. ప్రతి కూలీ పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. హార్టికల్చర్ పనులపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఉపాధి ప్రగతి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ షబ్బీర్‌బాషా, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వికలాంగురాలికి వీల్‌చైర్ వితరణ

తాడిపత్రి అర్బన్: మధుమేహం వ్యాధి బారిన పడి ఓ కాలు పోగొట్టుకున్న మహిళకు ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు వీల్ చైర్ శుక్రవారం వితరణగా అందజేశారు. పట్టణంలోని ఓగేటి వీధికి చెందిన మున్నీకి మధుమేహ వ్యాధి ఎక్కువ కావడంతో.. వైద్యులు ఇటీవల ఆమె కాలు తొలగించారు. కొందరు దాతలు ఆమెకు కృత్రిమ కాలును అమర్చినా నడవలేక ఇబ్బంది పడుతోంది. ఈవిషయాన్ని గమనించిన ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు రూ.6,500ల విలువ గల వీల్‌చైర్ అందజేశారు. అలాగే పక్షవాతం వ్యాధితో బాధపడుతున్న ఆమె భర్త మాబూ వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేయడంతో పాటు వారి పోషణార్థం నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడుర గుర్రప్ప, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కన్వీనర్ శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగభూషణరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సభ్యులు పాల్గొన్నారు.

2న 'బుగ్గ'లో అన్నాభిషేకం

తాడిపత్రి అర్బన్: స్థానిక శ్రీబుగ్గ రామలింగేశ్వరుడికి ఆగస్టు 2న పౌర్ణమి సందర్భంగా అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ పోలిశెట్టి ఆంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 5 గంటల నుంచి పూజలు ప్రారంభిస్తామన్నారు.

గెస్ట్ ఉపాధ్యాయుడి తొలగింపు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో గెస్ట్ మ్యాథ్స్ ఉపాధ్యాయుడు సుధాకర్‌ను విధుల నుంచి తొలగించినట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న రాత్రి పాఠశాలలో ఉపాధ్యాయుడు సుధాకర్ తమ ద్విచక్ర వాహనం శుభ్రం చేస్తుండగా విద్యార్థులు సహకరించడంతో కొందరు ఫోటో తీసి పాఠశాల ప్రిన్సిపాల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారన్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించామన్నారు.